# "జడివాన కురిసి వెలిసె"

(కథానిక)

భార్యపోయి ఆరునెలలయినా, వయస్సు నలభైకి మించకపోయినా చిదంబరానికి మళ్ళీపెళ్ళి చేసుకోవాలన్న తలంపు రాలేదు. పోయినభార్యవల్ల సంతానం కల్గలేదు. ఐనా చిదంబరం ఆ విషయంలో ఎక్కువ పరితపించలేదు. తన జీవితం సాఫీగానే గడిచిపోతుందనుకున్నాడు.

అయితే అతనికి చాలా ఆశ్చర్యం కల్గించిన విషయమేమిటంటే రోజూ ప్రొద్దున్నపూటా, మధ్యాహ్నంవేళా, సాయంత్ర సమయానా యిరుగునున్న బలరామయ్యగారూ, ఎదురింటి సుందరంగారూ, ప్రక్కవీధి ప్రభాకరంగారూ, యింకా అయిదారుగురు పెద్దమనుష్యులూ వచ్చి పెళ్ళి విషయం తెగపోరటం. తనకు తెలిసినంత వరకూ వాళ్ళలో ఎవరికీ అంత డబ్బులేదు. అంతకుముందు ఏదో ఓహో అంటే ఓహో అనే వాళ్లు యిప్పుడు తమంతట తాము వచ్చి పెళ్ళి విషయం తెగ ఆరాటపడ్తున్నారు. చిదంబరం, కామేశ్వరిని ఎంతగానో ప్రేమించాడు. ఆమె వల్ల సంతానం కలగలేదని విచారించలేదు. అల్లారు ముద్దుగా చూసుకున్నాడు. ఆరునెలల క్రితం అతని భాగ్యదేవత టి. బి. వ్యాధికి బలి అయిపోయింది. చిదంబరం ఏడిచాడు. తల బాదుకున్నాడు.

చిదంబరం, కామేశ్వరి స్థానంలో మరొకరికి చోటివ్వలేకపోయాడు. పదిమందీ రోజూ వచ్చి తనతో యుద్ధం చేసిపోతున్నారు. చిదంబరానికి తన పెళ్ళి విషయం యితరులు ఎందుకు అంత శ్రద్ధ చూపుతున్నారో అర్థం కాలేదు. తనమీది అభిమానంచేతనేమో అనుకున్నాడు. ఆ భావంచేత వచ్చినవారికి నిష్కర్షగా జవాబు చెప్పలేక పోతున్నాడు.

చిదంబరం చాలా ఆస్తిపరుడు. తను ఒంటరిగావున్నా, ఖర్చుపెట్టలేనంత డబ్బు యింట్లో మూలుగుతూన్నా ఆ విషయంలో ఆట్టే బాధపడలేదు. నిజంగా అతను అమాయకుడు. ఏమాత్రం బుర్ర వుపయోగించినా తన వివాహ విషయంలో యితరుల కెందుకు శ్రద్ధ జనించిందో అవగాహనయి వుండేది.

రోజులు గడుస్తున్నాయి. చిదంబరానికి సలహాదారులు ఎక్కువయిపోయారు. కాలు కదిపితే ఎవడో ఒకడు తయారవుతున్నాడు. పోనీ యింట్లో కూర్చుందామన్నా అదోక్లబ్బు అయి వూరుకున్నది. అతనికి విసుగెత్తిపోయింది. "నాగొడవ మీ కెందుకయ్యా" అనలేక పోతున్నాడు. వారి బారినుండీ తప్పించుకోలేక పోతున్నాడు. ఆలోచించాడు: వారి బాధ తప్పించుకోటానికయినా 'వూ' అంటే!

ఒకరోజు ప్రక్కవూరినుంచి సుబ్బారావు వచ్చాడు. అతను చిదంబరానికి వరసకి మేనల్లుడవుతాడు.

"ఏం మామయ్యా? నీ పెళ్ళి విషయం ఏం ఆలోచించావు?" అని కదిపాడు.

చిదంబరానికి కొంచెం కోపం వచ్చింది. "నీకుకూడా ఆ పిచ్చే పట్టింది నాయనా? అయినా నా పెళ్ళి విషయం మీ కెందుకంట? నాసంగతి నాకు తెలీదూ?" అన్నాడు బంధుత్వాన్నిబట్టి చను వుపయోగించి.

సుబ్బారావు మొహం ముడుచుకున్నాడు. "మధ్య నాకెందుకు మామయ్యా. నీ పెళ్ళి జరిగితే నా కేమయినావస్తుందా ఏమన్నానా? ఏదో చుట్టాన్ని కాబట్టి చెప్పాను" అన్నాడు.

చిదంబరం తమాషాకి అన్నాడో, యథార్థానికి అన్నాడో చెప్పటం కష్టం. మొత్తానికి అన్నాడు "కోపం తెచ్చుకోకురా అబ్బాయి! ఐతే నీ ఎరుకలో ఎవరన్నా పిల్లలున్నారా?"

సుబ్బారావుకు కొంచెం ధైర్యం వచ్చింది. "లేకేం? ఆ పనిమీదే నేను వస్త. మా యింటి ప్రక్కనే సోమసుందరంగారని ఒకాయన వున్నాడు. ఆయనకి ఒక కూతురుంది. ఏదో

కొమ్మూరి వేణుగోపాలరావు

మాటల్లో నీవిషయం చెప్తే యిష్టమవుతుందేమో కనుక్కోమన్నాడు" అన్నాడు.

"పిల్ల కెన్నేళ్లుంటాయి?"

"పద్నాలుగు"

"సరే అయితే నువ్వీ సాయంత్రమే వెళ్లి రేపు పిల్లని చూడటానికి నేను వస్తున్నానని చెప్పు" ఆ సాయంత్రమే సుబ్బారావు వెళ్ళిపోయాడు. చిదంబరానికి నిజంగా యీ పెళ్ళి యిష్టంలేదు. కాని వూళ్ళో వాళ్ళపోరు పడకుండా వుండటానికయినా తను పెళ్ళి చేసుకోవాలి. అప్పుడు తనుచేసిన యీ పనికి తన హితులందరూ సంతోషిస్తారనుకున్నాడు.

మరునాడు వుదయమే పార్వతీపురం వెళ్లి పిల్లని చూశాడు. పేరు లలిత. పిల్ల బాగానే వుంటుంది. వెళ్ళినవాడు ముహూర్తం కూడా నిశ్చయించుకుని మరీవచ్చాడు. తనవంటి రెండో పెళ్ళివాడికి ఏమాత్రం ఆటంకం లేకుండా పద్నాలుగేళ్ళ పడుచును యివ్వటానికి ఎలా ఒప్పుకున్నారో? అని ఆశ్చర్యపడ్డాడు.

ఊళ్ళో అందరికీ శుభలేఖలు పంచిపెట్టబడ్డాయి, ముఖంగా బలరామయ్యగారికి సుందరంగారికి, ప్రభాకరంగారికి స్వయంగా వెళ్ళి యిచ్చివచ్చాడు. ఆ వర్తమానం వినగానే ఎంతో సంతోషం వెలిబుచ్చుతారనుకున్నాడు. కాని అలా జరగకుండా వూరికే తలలాడించి వూరుకుని చిదంబరం వెళ్ళిపోగానే పళ్ళు తెగకొరుక్కున్నారు. చిదంబరం వివాహానికి ప్రోత్సహించిన తదితరులుకూడా అలాగే ప్రవర్తించారు. చిదంబరానికి మాత్రం వారి తంతేమీ అర్థంకాలేదు.

పెళ్ళి జరిగిపోయింది. అందులో కూడా చెప్పుకోతగ్గదేమీ లేదు. బలరామయ్యా, మరి పదిమంది హితులూ మాత్రం ఆవంక రాలేదు. ఆ విషయం చిదంబరానికి కొంచెం అలజడి కలిగించింది. తను ఎవరికోసం వివాహం చేసుకుంటున్నాడు? తన హితులమాట తీసెయ్యలేక. మరి ఆ ముఖ్యులే తన పెళ్ళికి రాకపోతే...

ఒకటి రెండుసార్లు బలరామయ్య బజార్లో కనిపించినప్పుడు పలుకరించాడు. ఆయన ఏదో ముక్తసరిగా సమాధానం చెప్పి తప్పించుకుపోయాడు. మరోసారి తనని వీథిచివర చూసిన ప్రభాకరం అప్పుడే యింట్లోంచి బయటకు అడుగువేస్తూ చటుక్కున లోపలకుపోయి తలుపులు బిడాయించాడు. చిదంబరానికి తల కొట్టేసినట్లయింది. సుందరం అసలు కనిపించనే లేదు. అంతకుముందు పదిమంది హితుల మధ్య నలిగిపోతూ వీళ్ళమాటలు ఏకధాటిగా వినలేక రోజుకు యిరవైనాలుగు గంటలు కాక కనీసం యింకో పదిగంటలయినా హెచ్చించమని భగవంతుని ప్రార్థించిన చిదంబరానికి యిప్పుడు కాలక్షేపం కరువయ్యింది. ఇంట్లో ఏం ప్రొద్దుపోవటంలేదు. బయటకి వస్తే తనని చూసి చాలామంది మూతులు త్రిప్పుకుంటున్నారు.

ఒకసారి రాత్రి ఏడింటికి అలా పార్కుకు వెళ్ళి వస్తున్నాడు. బలరామయ్యగారింటి ప్రక్కనుంచి నడిచి వస్తున్నాడు. అరుగుమీదినుంచి బలరామయ్య గొంతు వినిపించింది. "అయినా సుందరం! ఆ చిదంబరంగాడికి అదేం పోయేకాలమంట. గాడిదలాగ నలభయ్యేళ్లు వచ్చి యిప్పుడు రెండోపెళ్ళి చేసుకోకపోలే కొంప మునిగిపోయిందా? అన్నీ వెధవబుద్ధులూ వాడూను."

చిదంబరం తన చెవుల్ని తను నమ్మలేకపోయాడు. కొన్నిరోజులక్రితం తన శ్రేయోభిలాషిలాగ మాట్లాడిన యీ బలరామయ్యేనా యిలా అనటం? కోపంతో వళ్లు దహించుకునిపోయింది. గబగబ అడుగులువేస్తూ వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత పదిహేను రోజులలోనే బలరామయ్యగారి పదహారేళ్ళ కూతురికీ, ఒక బడిపంతులికీ వివాహం జరిగింది. ఇప్పుడిప్పుడు చిదంబరానికి అసలు విషయం అర్థం కాసాగింది. అయితే బలదామయ్య తన కూతుర్ని తనకోసమే వుంచాడా? అందుకేనా తనను పెళ్ళి చేసుకొమ్మని పోరిపోరి వదిలిపెట్టింది. అయితే తనను పెళ్ళి చేసుకొమ్మని హితోపదేశాలు చేసిన ప్రతివారూ అదే వుద్దేశాన్ని కలిగియున్నారా? తనను అల్లుడిగా చేసుకోటానికి కుతూహల పడటంలో అంతరార్థం ఏమయివుంటుంది. చిదంబరం ఆలోచించాడు. ఆలోచించగా ఆలోచించగా తెలిసింది. అవును, తన డబ్బే కారణం.

ఈ విషయం వూహలోకి వచ్చిన తర్వాత చిదంబరానికి వాళ్ళందరిపైనా చెప్పరాని ఏహ్యభావం కలిగింది. అంతలోనే అతనికి యింకో ఆలోచన కూడా వచ్చి మనస్సును కలతపెట్టింది. తనకు లలితను యివ్వటానికి కూడా కారణమదే అయివుంటుందా?

చిదంబరం ఏది ఏమయినా తన భార్యను తెచ్చుకోవాలనుకున్నాడు. తెచ్చుకున్నాడు.

చిదంబరం భార్య లలిత కాపరానికివచ్చింది మొదలు బయట తుఫాను మాట అటుంచి యింట్లోకూడా గాలిదుమారం ఆరంభమయింది. ఇంటి పెత్తనమంతా లలిత చేతికి వచ్చింది. ఆడింది ఆట పాడింది పాట అయింది. చిదంబరం యీ రెంటి ధాటికి తట్టుకోలేక తల్లడిల్లి పోసాగాడు.

ఒక రోజున చిదంబరం సావిట్లో కూర్చుని ఆలోచిస్తున్నాడు. గంట పదయ్యింది. అప్పటికి లలిత కాపురానికి వచ్చి నెలరోజు లయివుంటుంది. ఈ నెల రోజులలోనే రెండో పెళ్లాం చేసే హంగామా ఎటువంటిదో చవిచూశాడు చిదంబరం.

ఇంతలో వాకిట్లో జట్కా ఆగింది. చిదంబరం తలెత్తి చూశాడు. బండిలోంచి వరుసగా దిగుతున్నారు. మామగారూ, అత్తగారూ, పదేళ్ల మరదలు, ఇద్దరు బావమరుదులూ. చిదంబరం ఆత్రంగా లేచి వాళ్ళందర్నీ లోపలికి ఆహ్వానించాడు.

"ఏమోయ్ కులాసాగా వున్నావా?" అని పలకరించాడు సమవయస్కుడయిన మామగారు.

చిదంబరం తల ఆడించాడు. లలిత, తమ కుటుంబం అంతా వచ్చినందుకు అమిత ఆనందం అనుభవించి మళ్ళీ ఎసరు పెట్టమని వంటమనిషికి ఉత్తరవు జారీచేసింది. ముందుగా వుత్తరమన్నా రాయకుండా వాళ్ళంతా ఎందుకు వచ్చారో చిదంబరానికి అర్థంకాలేదు.

రెండు నెలలు గడిచిపోయాయి. సోమసుందరంగారు అక్కడినుంచి కదలలేదు. ఆయన వచ్చిన ఎందుకో చిదంబరం అడగనూలేదు. ఆయన చెప్పనూలేదు. చిదంబరానికి మాత్రం వాళ్లు తిష్ఠవేసి కూర్చోటం చెడ్డ చిరాగ్గా వున్నది. వాళ్లు కూర్చుని తినటంవల్ల తన ఆస్తంతా అరిగిపోతుందని కాదు. ఎప్పుడూ తండ్రీ కూతుళ్లు గదిల్లో కూర్చుని చెవులు కొరుక్కోటం, భార్య తన విషయం అసలు పట్టించుకోకుండా వుండటం, పిల్లలు ముగ్గురూ చేరి చేస్తున్న గోల భరించలేకపోతున్నాడు. అప్పుడప్పుడు అతను జేబులో పెట్టుకున్న అయిదూ, పదీపోతూవుండటంకూడ పరిపాటయిపోయింది.

ఒక రోజున చిదంబరం చొక్కాను వంకెకి తగిలించి స్నానం చేయటానికిపోయాడు. మళ్ళీ అతను గదిలోకి ప్రవేశించేటప్పటికి పెద్ద బావమరిది బిత్తర చూపులు చూస్తూ గదిలోంచి బయటకు వెళ్ళిపోవటం కళ్ళబడింది. చిదంబరానికి అనుమానం తగిలి చొక్కా జేబు చూసుకున్నాడు. స్నానానికి వెళ్ళేటప్పుడు జేబులో పాతిక రూపాయలున్నాయి. ఇప్పుడు చూసుకుంటే పదిహేనే కనిపించాయి. అతనికి చాలా కోపం వచ్చింది.

"గోపీ! ఒరేయ్ గోపీ!" అని అరిచాడు.

"ఏమిటి బావా?" అంటూవచ్చాడు గోపీ.

"ఇందులో పది రూపాయలు పోయాయి. ఏమయ్యాయి?"

గోపీ కొంచెం కంగారుపడ్డాడు. "ఏమో? నాకేం తెలుసు?"

"తెలీదేం? నేను చూడలేదనుకుంటున్నావా? దొంగ బుద్ధులూ మీరూనూ? కూర్చుని తింటున్నారు చాలదూ? ఇంకా కొంపంతా నాశనం చెయ్యాలనేనా?"

గోపీ తలవంచుకున్నాడు. ఎదురు తిరిగేవాడే కాని ఒంటరిగాడయి పోయాడు.

"ఏంరా? మాట్లాడవేం?"

ఈ గొడవ విని వంటింట్లో కబుర్లు చెప్పుతున్న సోమసుందరమూ, అతని వెనకాలే భార్య పరిగెత్తుకొచ్చారు.

"ఏమిట్రా అదీ?" అని అడిగాడు సోమసుందరం.

"చూడు నాన్నా. నేను బావ జేబులోంచి పది రూపాయలు తీశానట" అన్నాడు అలుసు చూసుకుని గోపి.

సోమసుందరం గారికి చాలా కోపంవచ్చింది. "ఇదేం పనయ్యా. మీ యింట్లో వుంటున్నా

మని ఎంతమాట పడితే అంతమాట అంటా వేమిటి?" అన్నాడు.

చిదంబరానికి యింతకాలం నుంచీ హృదయంలో పేరుకుపోయివున్న క్రోధం బయటకు చిమ్మింది. "అవును. దొంగపని చేశాడు కాబట్టి అడిగాను. వున్నమాట అనటానికి దడవ నవసరం లేదు" అన్నాడు.

"అయితే మీయింట్లో గతిలేక వుంటున్నా మనుకుంటున్నావా?"

"ఆ మాట నేననలేదు. అయినా ఎందుకు కాకూడదు?"

సోమసుందరంగారికి వళ్లు మండింది. "ఏమయ్యోయ్. మాటలు తిన్నగా రానీ. నా కూతుర్ని నీ అందం చూసి యిచ్చా ననుకుంటున్నావా? నేనింక ఒక్కక్షణం యీ యింట్లో వుండను" అని అరిచాడు.

"ఆ మాటే నేనూ అంటున్నాను. ఇంతవరకూ వచ్చిం తర్వాత నిన్నింక యీ యింట్లో వుండనిస్తా ననుకుంటున్నావు కా బో లు" అన్నాడు చిదంబరం కోపంగా.

"అంతపని అవసరంలేదులే. ఎరక్కపోయి నా కూతుర్నిచ్చాను. నువ్వు లేకపోతే బ్రతకలేకపోంలే. నా కూతుర్ని కూడా యిక్కడ వుంచను."

చిదంబరం ఒక్కసారి వులిక్కిపడ్డాడు. తనెందుకు పెళ్ళి చేసుకున్నాడు? నలుగురితో వేగలేక శాంతికోసం. ఆ శాంతి అభ్యమవనందుకు వీళ్ళంతా ఎందుకు? ఆవిడ లేకపోతే తను బ్రతకలేడా? అదివరకెలా బ్రతికాడు?

"నీ యిష్టం. నువ్వేం చేసుకున్నా నాకిష్టమే. తీసుకుపో"

తను ప్రయోగించిన అస్త్రం వుపయోగపడనిసరికి హతాశుడయి కోపాన్ని చంపుకోలేక అరిచాడు, "ఒసే అమ్మాయి. పచ్చేసెయ్యి. ఈ పాడు కొంపలో ఒక్క క్షణం వుండొద్దు"

వచ్చిన వాళ్లంతా వెళ్ళిపోతుంటే చిదంబరం చలించలేదు. అంతా వెళ్లిపోగానే తలుపు భఢాలున వేసుకుని అమ్మయ్య అనుకున్నాడు. జరుగున్నదంతా కిటికీలోంచి చూస్తున్న సుందరం యీ విషయాన్ని బలరామయ్యతో చెప్పటానికి పరిగెత్తుకు పోయాడు.

చిదంబరం మనస్సు యిప్పుడెంతో తేలికపడింది. తన కిష్టం లేకుండా తెచ్చుకున్న భార్య తన మీద నేరం లేకుండానే వచ్చిన దారిన వెళ్ళిపోయింది. యిక వూళ్లో తనను చూచి పళ్లు కొరుక్కోరు. చిదంబరం ఒకటి నిశ్చయించుకున్నాడు. మళ్లీ ఏ కారణం చేతనయినా భార్య తిరిగొస్తే ఆమెను మళ్ళీ స్వీకరించ కూడదు. తన జీవితం ఒంటరిగానే అంతమయిపోవాలి.

మరునాటి వుదయం బలరామయ్యగారు చిదంబరం యింటికి వచ్చి "చిదంబరంగారూ!" అని కేకేశాడు.

కథానిక

# సదానందుడి మహిమ

పి. రామచంద్రరావు

రామసుబ్బయ్యగారు ఆ వూళ్ళోకల్లా ధనవంతులు. చక్కని మేడ, చుట్టూ పూలతోట ఎంతో మనోహరంగా వుంటుంది. దొడ్డినిండా పశువులు, పదిమంది పాలేళ్లుకలిగి పాడిపంటలుసమృద్ధిగావున్నాయి. ఊళ్ళోకల్లామంచి భూములన్నీ ఆయనవే. ఆయనమాటకు యెదురాడే వ్యక్తేలేడు. నయానా, భయానా వూళ్లో జనమంతా ఆయన చెప్పు చేతల్లో వుండేవారు. ఆపద వచ్చినప్పుడు ఎక్కువవడ్డీ తీసుకొన్నా — పెట్టుబడి పెడుతూండేవారు. ఈ విషయంలో రామసుబ్బయ్యగారికి దూరదృష్టి లేకపోలేదు. అప్పుతీసుకొన్న విశ్వాసం వూరికేపోదు. వడ్డీకి వడ్డీ వస్తుంది. అవసరమయినప్పుడు ఆ పలుకుబడితో పనులన్నీ నెరవేర్చుకోవచ్చు. అంతా ఆయన పరోపకారాన్ని శ్లాఘించుతూ వుంటారు.